క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ ఖచ్చితంగా తీసుకోవాలని ట్రేడ్ లైసెన్స్ ఇన్‌చార్జి, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ అన్నారు. ఆర్మూర్‌తో పాటు పెర్కిట్, మామిడిపల్లిలో శుక్రవారం ఆయన పర్యటించి వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్‌లను తనిఖీ చేశారు. వార్డు అధికారులు చక్రధర్, యుగంధర్, మున్సిపల్ సిబ్బంది రమేష్, ప్రశాంత్‌లు ఉన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



రుద్రూర్: బాలల సంరక్షణ బాధ్యత అందరిదని బోధన్ సీడీపీవో జానకి అన్నారు. మోస్రా మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి బాలల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యల్లో, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న బాలలను రక్షించడానికి ఈ కమిటి పని చేస్తుందన్నారు. ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, ఎంపీడీవో భారతి, ఇన్‌చార్జి ఎస్సై ఆనంద్ సాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సహించం



రుద్రూర్: బీజేపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని మోస్రా మండల బీజేపీ అధ్యక్షుడు కోనపురం స్వామిగౌడ్ అన్నారు. మోస్రాలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై ఇటీవల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. నాయకులు సాయిలు, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని మావందికుర్దు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో రాజేశ్వర్, ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఎంపీడీవో పర్బన్న, ఎఈంవో నాగనాథ్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర సభలను జయప్రదం చేయండి

బోధన్: అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 24, 25న సూర్యపేటలో జరుగనున్నాయని సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, జిల్లా ప్రతినిధులు నడ్పి భూమయ్య, చిన్న పర్వయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, కూలీలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభలను విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలను సంరక్షించాలి



బాల్కొండ: నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వరదరాజన్ అన్నారు. మండలంలోని వన్నెల్(బి)లో నర్సరీని శుక్రవారం వారు పరిశీలించారు. మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు.అనంతరం బోదేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంపీడీవో సంతోష్, సర్పంచ్ రవి, ఉప సర్పంచ్ కిషన్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ గురుకుల పాఠశాలలో నిర్వహించే వేసవి శిబిరం వాల్ పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 22నుంచి వచ్చే నెల ఆరు వరకు శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సుదర్శన్ తెలిపారు. ఆర్‌సీవో యేసుపాదం, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

బోధన్‌ను సందర్శించిన భారత్ దర్శన్ బృందం

బోధన్‌టౌన్(బోధన్): ఏక్ భారత్- శ్రేష్ఠభారత్ స్ఫూర్తితో తెలుగు సంగమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ దర్శన్‌లో భాగంగా శుక్రవారం రాత్రి మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి, జాతీయ నాయకులు మురళిధర్‌రావ్, ప్రతినిధులు బోధన్‌ను సందర్శించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమాఖ్య భవనం పూర్తయేదెన్నడో?

- బోధన్‌లో పదేళ్ల క్రితం పనులకు పునాది
- ఇప్పటికీ పూర్తికాని వైనం
- శిథిలావస్థలో ప్రస్తుత భవనం

బోధన్: పట్టణ మహిళ సమాఖ్యకు సొంత భవనం కోసం పదేళ్ల క్రితం పనులు ప్రారంభించినా.. ఇప్పటికీ పూర్తికాలేదు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రతి నెలా సమాఖ్య పాలకవర్గ సమావేశాలు నిర్వహించుకునేందుకు సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నా, సమాఖ్య భవన నిర్మాణంపై మున్సిపల్ పాలకవర్గం మాత్రం దృష్టి సారించడం లేదు.



బోధన్ మున్సిపల్ ఆవరణలో పునాదుల వద్ద నిలిచిపోయిన పట్టణ మహిళా సమాఖ్య భవన నిర్మాణం

పట్టణం..	బోధన్
మున్సిపల్ వార్డులు మొత్తం	38
పొదుపు మహిళ సంఘాల సంఖ్య	1296
సంఘ సభ్యుల సంఖ్య	13000
పట్టణ మహిళ సమాఖ్య	01
వార్డు మహిళ సమాఖ్యల సంఖ్య	48



అర్ధాంతరంగా నిలిచిన పనులు..

పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు ఆవరణలో స్థలాన్ని ఎంపిక చేసి పట్టణ మహిళ సమాఖ్య నూతన భవన నిర్మాణానికి 2012–13లో పునాది వేశారు. అప్పటి ప్రభుత్వంలో ఎస్‌జేఎస్‌ఆర్‌వై(స్వర్ణ జయంతి షహరీ రోజ్‌గార్ యోజన) పథకం కింద పనుల కోసం రూ. 25లక్షలు కేటాయించారు. ఇందులో రూ. 5లక్షలు మంజూరు కావడంతో పునాదుల వరకు నిర్మాణ పనులు చేపట్టారు. 2014లో ఎస్‌జేఎస్‌ఆర్‌వై పథకం రద్దు కావడంతో మిగిలిన నిధులు ఆగిపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తాజాగా ఎమ్మెల్యే షకీల్ భవన పనుల కోసం రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రస్తుతం మున్సిపల్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో మెప్మా ఆఫీసును ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈ భవనం పైకప్పు శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. మహిళ సంఘాల సభ్యులు, సిబ్బంది భయాందోళన మధ్య కాలం వెళ్ల దీస్తున్నారు.

పన్నెండేళ్ల క్రితం సమాఖ్య ఏర్పాటు..

2009–10 ఏడాదిలో పట్టణ మహిళ సమాఖ్య ఏర్పాటైంది. పొదుపు మహిళా సంఘాల్లో వేలాదిమంది మహిళలు సభ్యులుగా చేరారు. పట్టణ మహిళ సమాఖ్య పాలకవర్గంతో పాటు 48 వార్డు సమాఖ్యలు ఏర్పడ్డాయి. ఒకొక్క వార్డు సమాఖ్యలో 20నుంచి 30పొదుపు మహిళ సంఘాలు ఉంటాయి. నెలకోసారి సమావేశాలు జరుపుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక లావాదేవీలతో పాటు ఆరోగ్య, సామాజిక అంశాలపై అవగాహన, సమీక్ష సమావేశాలు నిర్వహించుకోవాల్సి ఉండగా అనువైన స్థలాలు, భవనాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిలిచిన పనులను వెంటనే ప్రారంభించి, భవన నిర్మాణం పూర్తి చేయాలని సమాఖ్య సభ్యులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ భవనంలోకి మార్చుతాం..

మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలో ఉన్న మెప్మా ఆఫీసు గది శిథిలావస్థలో ఉన్న విషయం గుర్తించాం ప్రత్యామ్నాయంగా అనువైన మరో భవనంలోకి మార్చేందుకు ప్రయత్నిస్తాను.

–ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, బోధన్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం..

సొంత భవనం లేక సమావేశాలు జరుపుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని ఎమ్మెల్యే షకీల్ దృష్టికి తీసుకెళ్లాం. రూ. 10లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

–గట్టు రాణి, అధ్యక్షురాలు, పట్టణ మహిళా సమాఖ్య, బోధన్

వీరశైవ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

- మహారాష్ట్ర ప్రాంత తమ్లూర్ మఠాధిపతి శివానంద శివాచార్యులు
- బోధన్‌లో కొనసాగిన అఖండ శివనామ సప్తాహం

బోధన్ : వీరశైవ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని మహారాష్ట్ర ప్రాంత తమ్లూర్ మఠాధిపతి శివానంద చార్య మహారాజ్ ప్రబోధించారు. పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో వీరశైవ సమాజ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 18వ అఖండ శివనామ సప్తాహ శుక్రవారం రెండోరోజు కొనసాగింది. శిబిరాన్ని సందర్శించిన మఠాధిపతి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. పరమ రహస్య గ్రంథ పారాయణం విశిష్టతను వివరించారు. మానవాళి సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షతోనే అఖండ శివనామ సప్తాహ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం శివభజన, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



బోధన్‌లో ప్రవచనాలు చేస్తున్న మహారాష్ట్ర ప్రాంత తమ్లూర్ మఠాధిపతి శివానంద శివాచార్యులు

బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలి

బోధన్: ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం బోధన్ ఆర్డీవో రాజేశ్వర్‌కు కార్మికులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కార్మికులకు నాలుగు నెలల బకాయి బిల్లులు రూ.6కోట్లు ప్రభుత్వం రావాల్సి ఉందన్నారు. అప్పులు చేసి భోజనం అందిస్తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. కార్మికులకు ప్రభుత్వం పెంచిన నెలసరి వేతనం జీవోను అమలు చేయాలన్నారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని లేదంటే సరిపడా బడ్జెట్ కేటాయించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళను ఉధృతం చేస్తామన్నారు. సంఘ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.



ఆర్డీవో ఆఫీస్ ఎదుట మాట్లాడుతున్న చక్రపాణి

ఎన్నికల హామీలను అమలుపర్చండి



బోధన్‌లో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

రెంజల్(బోధన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం మండలంలోని పేదలు, బీడీకార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ శశికిరణ్‌కు వినతిపత్రం అందించారు. ప్రజాపంథ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలు, బీడీ కార్మికులకు డబుల్ బెడ్‌రూంలు మంజూరు చేయాలని, స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని వారికి రూ.10లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులు చేసి అర్హులకు కార్డులు అందించాలని సూచించారు. జిల్లా కమిటీ సభ్యులు మిద్దె నరేందర్, పుట్టి నాగన్న, రాజేశ్వర్, నసీర్, ఒడ్డెన్న, మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్కొండ: ఎన్నికల సమయంలో కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమ సమిత రైతు విభాగం ఉభయ జిల్లాల అధ్యక్షుడు బుల్లెట్ రాంరెడ్డి డిమాండ్ చేశారు.ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పసుపు రైతులను ఆదుకుంటామని ప్రకటించిన సీఎం కేసీఆర్ మాటలు ఏమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపుబోర్డు తీసుకు వస్తానని బాండ్‌పేపర్ రాసిచ్చిన ఎంపీ అరివింద్ మాట తప్పాడన్నారు.

మైనారిటీ సంక్షేమానికి కృషి



రుద్రూర్: మైనారిటీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రుద్రూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు స్పీకర్ హాజరై, ప్రార్థనలు చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

రుద్రూర్: బొప్పాపూర్ గ్రామంలో, కోటగిరిలో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్, డీసీసీ డెలిగేట్ శ్రీనివాస్‌రావ్, రాజిరెడ్డి, ప్రతాప్‌సింగ్, పట్ల సురేష్, బుర్క శ్రీనివాస్, దత్తు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం





ఆర్మూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు.. దొంకేశ్వర్ గ్రామంలో..

పెర్కిట్(ఆర్మూర్)/ఎడపల్లి(బోధన్)/ఆర్మూర్ టౌన్/నందిపేట్(ఆర్మూర్)/నవీపేట/రుద్రూర్/బాల్కొండ/భీమ్‌గల్: ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు సొసైటీల ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలన్నారు.పంటను దళారులకు విక్రయించి, మోసపోవద్దన్నారు.



అభంగపట్నం గ్రామంలో..



అంబం గ్రామంలో..

రసవత్తరంగా కుస్తీ పోటీలు



వర్ని: వర్ని మండలం జాకోరా గ్రామంలో మత్త డి పోచమ్మ పండుగ పురస్కారించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. చివరి కుస్తీ (రూ.2వేల నగదు) ఉత్కంఠభరితంగా సాగింది. సర్పంచ్ గోదావరి గణేష్, ఎంపీటీసీ సాయిలు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

వేల్పూర్: బ్యాంకు రుణాలతో మహిళాసంఘాలు వ్యాపారం చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని హైదరాబాద్ ఏరియా జనరల్ మేనేజర్ మంజుశర్మ పేర్కొన్నారు. వేల్పూర్‌లో శుక్రవారం ప్రగతిశీల రైతులు, మహిళాసంఘ సభ్యుల సదస్సు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మహిళా సంఘాలకు రూ. 15కోట్ల 20లక్షల రుణాల చెక్కును అందజేశారు. కుకునూర్ గ్రామంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

ఎడపల్లి(బోధన్): మండలంలోని కుర్నాపల్లిలో శుక్రవారం ఉపాధి హామీ పనులను డీఆర్డీఏ అంబుడ్స్‌మెన్‌పర్సన్ శ్రీనివాస్, ఏపీడీ ఓంపాల్ పరిశీలించారు. డి40 కాలువను, పర్లకుంటను పరిశీలించారు.

శాస్త్రవేత్తల క్షేత్ర పర్యటన

బోధన్: సాలూర మండలంలోని కొప్పర్తి క్యాంప్ గ్రామ శివారులో శుక్రవారం రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు పర్యటించి వరి పంటను పరిశీలించారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌కు శాస్త్రవేత్తలు చిరుసంచుల విత్తనం పంటను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయవద్దు

రెంజల్(బోధన్): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఇబ్బందులు రానీయకుండా చర్యలు తీసుకునాలని అధికారులు సూచించారు. రెంజల్, బోర్గాం, అంబేద్కర్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు పరిశీలించారు. బోర్గాంలో లారీల కొరత ఉందని రైతులు ఏపీడీ మధుసుదన్, ఇన్‌చార్జి తహసీల్దార్ శశిభూషణ్ దృష్టికి తీసుకరాగా, ఆయన వెంటనే రెండు లారీలను రప్పించి సమస్యను పరిష్కరించారు. ఏమైన సమస్యలు వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. డీపీఎం సాయిలు, ఏపీఎం చిన్నయ్యలు తదితరులు పాల్గొన్నారు.



బోర్గాంలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ఎత్తివేత

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో ప్రతి సంవత్సరం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వరి కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ఈ సీజన్‌లో ఎత్తివేశారు. ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం, తరుగు, హమాలీ ఛార్జీల విషయంలో రైతులకు, నిర్వాహకులకు మధ్య వివాదం చోటు చేసుకుంది. అక్రమాలపై ప్రశ్నించినందుకే తమ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలు లేనిచోట మాత్రమే ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ తెలిపారు. చౌట్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో హాసాకొత్తూర్‌లో ఇదివరకే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, రైతుల సౌలభ్యం దృష్ట్యా అదనంగా మరో కాంటా ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు.

ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాలకు రుణాల చెల్లింపులు, రికవరి, స్త్రీనిధి, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల అమలులో తీరిక లేకుండా ఉండడంతో పాటు, చౌట్‌పల్లి సొసైటీ వారు అదనంగా కాంట ఏర్పాటు చేస్తుండడం వల్ల ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు.

బీమా పథకాలపై అవగాహన



రుద్రూర్: చందూర్ మండలం మేడిపల్లి గ్రామంలో ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం బీమా పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ రావు మాట్లాడుతూ.. పీఎం జీవన జ్యోతి, సురక్ష ప్రమాద బీమా, పర్సనల్ యాక్సిడెంట్ బీమా పాలసీ గూర్చి వివరించారు. సర్పంచ్ రవి, కార్యదర్శి సీతారాం పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

పౌల్ట్రీ ఫెడరేషన్..



పెర్కిట్(ఆర్మూర్): నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రాంతీయ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మామిడిపల్లిలో గల మైత్రీ ఫంక్షన్ హాల్‌లో ఫెడరేషన్ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రావణ్, కార్యదర్శిగా వెంకట్రావు, కోశాధికారిగా ఎంఏ అజీం, సభ్యులుగా శ్రీనివాస్, గంగారెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికలకు నారాయణరావు చీఫ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఫెడరేషన్ సభ్యులు అభినందించారు.

సంక్షిప్తం

మండల పరిషత్ తనిఖీ

బాల్కొండ: మెండోరా మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ సీఈవో గోవింద్ తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది సీఈవోను సన్మానించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సాయిలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

భీమ్‌గల్: పట్టణంలోని సర్వే నంబర్లు 475, 476 పక్కన గల శిఖం భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రేమలత, తహసీల్దార్ శ్రీధర్, ఎస్సై రాజ్ భరత్‌రెడ్డిలకు ఎర్రోడ్‌గల్లీ సంఘ సభ్యుల శుక్రవారం వినతిపత్రం అందించారు. ఆయా సర్వే నంబర్లలో లేఅవుట్‌లో మున్సిపల్ అధికారులతో సర్వే చేయించి 10% ల్యాండ్ మున్సిపాలిటీకి అప్పజెప్పాలన్నారు.

కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం గగ్గుపల్లిలో శుక్రవారం అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడం లేదన్నారు. ధాన్యం తడిసిపోకుండా ప్రభుత్వం టార్పాలిన్ కవర్లను సరఫరా చేయకపోవడంతో రైతులపై ఖర్చుల భారం పడుతోందన్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి

నవీపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రైతుకూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్‌సింగ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించి, సదుపాయాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మండల నాయకులు కిషన్ తదితరులు ఉన్నారు.

నలందలో గ్రాడ్యుయేషన్ డే

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలోని నలంద హైస్కూల్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరి విద్యను పూర్తి చేసుకుని ప్రైమరి విద్యలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు యాజమాన్యం పట్టాలను అందజేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

రుద్రూర్: మండలంలోని గోవూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, జెడ్పీటీసీ గుత్ప విజయభాస్కర్ రెడ్డి భూమిపూజ చేశారు. సర్పంచ్ నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కత్తి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల పరిశీలన

ఆర్మూర్‌టౌన్/బోధన్‌రూరల్(బోధన్)/బోధన్‌టౌన్(బోధన్): ఆర్మూర్, బోధన్ మండలాల్లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు జరిపే ఈద్గాను శుక్రవారం స్థానిక అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. అలాగే సాలూరలోని ఈద్గా కాంపౌడ్ నిర్మాణ పనులను ప్రారంభించారు.

రంజాన్ కానుకల పంపిణీ

ఆర్మూర్ టౌన్/రెంజల్(బోధన్)/వేల్పూర్: ఆర్మూర్, రెంజల్, వేల్పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ముస్లింలకు రంజాన్ కానుకలను స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.